

## మాయగాళ్లకు'మన్ను'దన్ను

సుందరీకరణ పేరుతో కూటమి నేతలు చిత్తూరు కట్టమంచి చెరువు నుంచి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. - 10లో



## బీసీ హాస్టల్ విద్యార్థులు శభాష్

బీసీ వసతి గృహ విద్యార్థులు శభాష్ అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభి నందించి, సర్టిఫికెట్లు అందజేశారు. - 10లో



## వడగండ్ల వాన.. పంటలకు నష్టం

చిత్తూరు జిల్లాలోని పలు చోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. పెనుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. - 10లో

## న్యూస్‌రీల్

### 'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు



సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**చిత్తూరు కలెక్టరేట్ :** నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శుక్రవారం ఆయన చిత్తూరులో నీట్ నిర్వహించనున్న కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని పీవీకేఎన్, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 4వ తేదీన నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 432 మంది, సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 278 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వివరించారు. సెంటర్‌లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరేంద్ర, పీవీకేఎన్ కళాశాల పరీక్షల విభాగం కో–ఆర్డినేటర్ శరవణ పాల్గొన్నారు.

### వ్యవసాయ జిల్లా కార్యాలయం ఏఓగా అంజయ్య



**గుడిపాల:** జిల్లా వ్యవసాయ కార్యాలయం పరిపాలన అధికారిగా గుడిపాల మండలం 189కొత్తపల్లెకు చెందిన అంజయ్య శుక్రవారం పదవీ భాధ్యతలు చేపట్టారు. ఆయన ఇక్కడే సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఏఓగా ఉద్యోగోన్నతి పొందారు.

### జగనన్నపై 'చిట్టి' అభిమానం



వైఎస్సార్‌సీపీ బ్యానర్‌తో కుట్టిన దుస్తుల్లో చిట్టి

**పలమనేరు:** అభిమానానికి హద్దులు లేవనేమాట నిజమే. గంగవరం మండలం నలసానపల్లెకు చెందిన డ్రైవర్ బాలాజీకి జగన్‌మోహన్‌రెడ్డి అంటే చాలా అభిమానం. ఆయన పుట్టినరోజుకు సైతం తిరుమలకు కాలినడకన వెళ్లి వచ్చారు. ఎన్నికల వేళ తన ఇంటికి కట్టుకొనేందుకు తీసుకెళ్లిన పార్టీ బ్యానర్లు, జెండాలను జాగ్రత్తగా పెట్టుకున్నారు. ఇతని మూడేళ్ల కుమార్తె చిట్టికి సైతం జగన్‌మోహన్‌రెడ్డి అంటే చాలా ఇష్టం. టీవీలో ఆయన కనిపించగానే జగన్ మామ అంటూ కేరింతలు కొడుతోంది. దీంతో గ్రామంలో గంగజాతర మొదలైంది. కాస్త విభిన్నంగా ఆలోచించిన బాలాజీ తన కుమార్తెకు పార్టీకి చెందిన జెండాలు, బ్యానర్‌ను టైలర్‌కిచ్చి బిడ్డకు దుస్తులు కుట్టించాడు. వాటిని ధరించిన చిట్టి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. దుస్తులు వేసుకుని గ్రామంలో చెంగుచెంగున వెళుతుంటే గ్రామస్తులు సైతం ఆ చిన్నారిని చూసి భలే ఉంది పాప డ్రెస్ అంటూ ఆశ్చర్యంగా తిలకించారు.

# ప్రయాణం.. ప్రయాస

చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ఖాళీగా ఉన్న బెంగళూరు స్టాప్



తిరుపతికి వెళ్లే బస్సులు రాక చిత్తూరు బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



చిత్తూరు జిల్లాలో బస్సుల కొరత ప్రయాణికులను వేధించింది. గంటల కొద్దీ బస్టాండ్లలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో జిల్లా నుంచి జన సమీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. జిల్లా నలుమూలల నుంచి జనాన్ని అమరావతికి తరలించేందుకు సన్నద్ధమైంది. ఇందుకోసం గురువారం రాత్రి నుంచి పలు ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకుంది. దీంతో బస్సు సర్వీసులు రద్దు అయ్యాయి. ఫలితంగా సకాలంలో బస్సులు లేక ప్రయాణికులకు ప్రయాణం ప్రయాసగా మారింది.

- ఆర్టీసీ బస్సులు అమరావతి సభకు మళ్లింపు
- జిల్లా నుంచి 130 బస్సులు
- ప్రయాణికులకు తిప్పలు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** కూటమి నేతలు చిత్తూరు జిల్లా నుంచి 130 బస్సుల సేవలను అమరావతికి మళ్లించారు. దీంతో చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. నిత్యం బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పడరాని పాట్లు పడ్డారు. రాజధాని పనుల పునఃప్రారంభానికి శుక్రవారం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతికి వచ్చారు. ఇందుకు జనసమీకరణ చేయడానికి కూటమి నేతలు జిల్లాలో మహిళలు, కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులను ఆర్టీసీలో బస్సుల్లో గురువారమే అమరావతికి తరలించారు. ఇందుకు జిల్లాలోని ఐదు ఆర్టీసీ డిపోల నుంచి 130 బస్సులను ఆర్టీసీ అధికారులు వారికి కేటాయించారు. మిగిలిన అరకొరగా బస్సులను స్థానికంగా నడిపారు. దీంతో బస్సులు లేక ప్రయాణికులు గమ్యం చేరడానికి కుస్తీ పట్టాల్సివచ్చింది.

**గంటల తరబడి నిరీక్షణ**

వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులు బస్సులు లేక పోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. చిన్న పిల్లలతో వచ్చిన వారు, చికిత్స కోసం వచ్చి తిరుగు ప్రయాణమైనవారు.. వృద్ధులు బస్టాండ్లలో నిరీక్షించి, నీరసించిపోయారు. కొంత మంది తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాల్లో గమ్యానికి చేరుకున్నారు. పీఎం సభకు తరలించిన బస్సులు అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందినవి కావడంతో గ్రామీణ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అరకొరగా ఉన్న బస్సుల్లో సీట్ల కోసం నువ్వా? నేనా? అన్నట్లు ఫీట్లు చేయాల్సివచ్చింది. అధికంగా తిరుపతి, బెంగళూరు, పీలేరు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లి, తవణంపల్లి, పెనుమూరు, జీడీనెల్లూరు కడప తదితర మార్గాల్లో నిత్యం బస్సులు రద్దీగా కనిపిస్తుంటాయి. ఈ మార్గాల్లో నడిచే బస్సులను కూడా రాజధానికి మళ్లించారు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. దీనికితోడు ఎండ వేడమి ఎక్కువగా ఉండడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఉక్కపోతతో విలవిలాడారు.

**మళ్లీ అప్పులు తప్పవా..?**

టీడీపీ గత ఐదేళ్ల పాలనలో ఆర్టీసీ చంద్రబాబు సేవలకు మాత్రమే పరిమితమైంది. ప్రయాణికుల సేవలను పక్కన పెట్టింది. టీడీపీ ప్రభుత్వ సమావేశాలు, పోలవరం షోలకు బస్సులను మళ్లించారు. ఆర్టీసీ కూడా అవసరమైనప్పుడల్లా కావాల్సినన్ని బస్సులను పంపింది. 2015 అక్టోబర్ నుంచి 2019 వరకు వివిధ ప్రాంతాల్లో జరిగే సభలు, పోలవరం విహారయాత్రకు మొత్తం 1,292 సర్వీసులను వినియోగించుకున్నారు. ఇందుకుగాను జిల్లాలోని వివిధ డిపోలకు రూ.4 కోట్ల మేర బకాయిలు పడింది. అప్పట్లో వారు చెల్లించింది రూ.14.64 లక్షలు మాత్రమే. మళ్లీ ఇలా సభలకు వెళ్లిన బస్సులకు సుమారు రూ.1.10 కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

### నేడు ఇదే పరిస్థితి..?

అమరావతికి జనాన్ని తరలించిన బస్సులు తిరిగి శనివారం ఆయా డిపోలకు చేరుకునే అవకాశం ఉంది. దీంతో వివిధ మార్గాల్లో రద్దు చేసిన బస్సు సర్వీసులను శనివారం సాయంత్రం తర్వాతనే ఆర్టీసీ అధికారులు పునురుద్ధరించనున్నారు. అప్పటి వరకు ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి, ప్రయాణించాల్సి పరిస్థితి నెలకొంది.



బెంగళూరు నుంచి వచ్చిన బస్సులో తిరుపతి వెళ్లేందుకు ప్రయాణికుల పాట్లు

### ఆర్టీసీ బస్సుల సమాచారం..

| | |
|---|---|
| డిపోల సంఖ్య – | 5 |
| మొత్తం బస్సులు – | 400 |
| పల్లెవెలుగు – | 233 |
| ఎక్స్‌ప్రెస్ – | 100 |
| సప్తగిరి ఎక్స్‌ప్రెస్ – | 33 |
| సూపర్‌లగ్జరీలు – | 30 |
| ఇంద్ర – | 04 |
| రోజువారీ తిరిగే కి.మీ – | 1.50 లక్షలు |
| రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య – | 1.11 లక్షలు |
| గతంలో యాత్రలు, సభలకు టీడీపీ ప్రభుత్వం తీసుకున్న బస్సులు – | 1,292 |
| అప్పట్లో బకాయిలు – | రూ4 కోట్లు |
| బకాయిల్లో అప్పట్లో చెల్లించింది.. – | 14.64 లక్షలు మాత్రమే |
| ఇప్పుడు పీఎం సభకు తీసుకున్న బస్సులు – | 130 |
| బస్సులకు చెల్లించాల్సిన నగదు – | రూ.1.10 కోట్లు (సుమారు) |

### డిపోల వారీగా అమరావతికి పంపిన బస్సుల సంఖ్య

| డిపో పేరు | పంపిన బస్సులసంఖ్య |
|---|---|
| చిత్తూరు వన్‌డిపో | 30 |
| చిత్తూరు టూడిపో | 35 |
| పుంగనూరు | 35 |
| పలమనేరు | 10 |
| కుప్పం | 20 |

### తిరుపతి బస్సులను కూడా మళ్లిస్తే ఎట్టా?



"నేను ప్రతిరోజు తిరుపతి–చిత్తూరు వస్తుంటాను. పని చూసుకుని సాయంత్రం 5 గంటల కల్లా తిరుపతికి బస్సు ఎక్కేలా చూసుకుంటున్నాను. డైలీ సాఫీగానే ప్రయాణం సాగుతోంది. 5 నుంచి 10 నిమిషాల్లో బస్సులు దొరికేది. అయితే శుక్రవారం బస్సు కోసం గంటల తరబడి వేచి చూస్తున్నా. బస్సులు అర్ధగంటకు ఒకటి వస్తోంది. అది కూడా బెంగళూరు బస్సు మాత్రమే. అన్నీ బస్సుల్లోనూ సీట్లు ఫుల్‌గా ఉన్నాయి. నిలబడి వెళదామనుకున్నా కుదరడం లేదు. తిరుపతికి వెళ్లే బస్సులను కూడా మళ్లించడం కరెక్టు కాదు.

– విజి, తిరుపతి–చిత్తూరు ప్రయాణికుడు

# రోడ్డు పనులకు రూ.72 కోట్లు

- 221 కిలోమీటర్ల మేర పలు రోడ్లు నిర్మాణం
- కుప్పం–మల్లానూరు రోడ్డుకు అత్యధికం

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలో ఆర్అండ్ బీ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని పలు రహదారులు 221 కిలోమీటర్ల మేర పనులు చేపట్టడానికి రూ.72 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దమల్లెల–ఎర్రావారిపాళెం రోడ్డుకు రూ.1.50 కోట్లు, చిత్తూరు–పుత్తూరు రోడ్డు నుంచి కమ్మకండ్రిగ రోడ్డు రూ.2 కోట్లు, చిత్తూరు–తిరుత్తణి రహదారి నుంచి వేలూరు రోడ్డు రూ.2 కోట్లు, నగరి నుంచి వెంగన్న కండ్రిగ రోడ్డుకు రూ.2 కోట్లు, అడవిబుదుగూరు క్రాస్ నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రూ.1.20 కోట్లు కేటాయించారు. కుప్పం–సంగనపల్లె రోడ్డు రూ.70 లక్షలు, కుప్పం–పాగురుపల్లె–గుడుపల్లె రూ.70 లక్షలు, రామకుప్పం–వి.కోట పేర్నంబట్టు రోడ్డుకు రూ.1.35 కోట్లు మంజూరు చేశారు. అలాగే బందార్లపల్లె క్రాస్ నుంచి పాముగానిపల్లె రో డ్డు రూ.67 లక్షలు, రామకుప్పం–వి.కోట–పేర్నంబట్టు రోడ్డు రూ.1.90 కోట్లు, కుప్పం–చిగురుగుంట రోడ్డుకు రూ.2.65 కోట్లు, గుడ్డూరు నుంచి కర్ణాటక సరిహద్దు (వయా కేసుమాకుపల్లె, పెద్దూరు) రోడ్డుకు రూ.1.85 కోట్లు, గుద్యాణంపల్లె–దిన్నేపల్లె రోడ్డు రూ.85 లక్షలు, 64 పెద్దూరు నుంచి కర్లగట్ట రోడ్డు రూ. 68 లక్షలు మంజూరు చేశారు. కుప్పం సరిహద్దు రహదారి నిర్మాణానికి రూ.4.95 కోట్లు, గుద్యాణంపల్లె రోడ్డు రూ.1.15 కోట్లు, కుప్పం – గుడుపల్లె రోడ్డు రూ.80 లక్షలు, కుప్పం–పాగురుపల్లె రోడ్డు రూ. 84 లక్షలు, గుద్యాణంపల్లె నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రూ.3.55 కోట్లు, ఎన్‌హెచ్ 219 క్రాస్ రోడ్డు రూ.40 లక్షలు, యామిగానిపల్లె రోడ్డు రూ.1.05 కోట్లు,పలమనేరు–కృష్ణగిరి బైపాస్ రోడ్డు రూ.79 లక్షలు, కుప్పం–పట్నూరు రోడ్డు రూ.3.84 కోట్లు, కుప్పం–మల్లానూరు రోడ్డుకు రూ.6.05 కోట్లు కేటాయించారు. పలమనేరు – కృష్ణగిరి రోడ్డుకు రూ.40 లక్షలు, వెంకటపల్లె నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డుకు రూ.50 లక్ష లు, కుప్పం–పలమనేరు రోడ్డు రూ.4.05 కోట్లు, కుప్పం–గుడుపల్లె రూ.6.02 కోట్లు, కుప్పం–పెద్దపర్తికుంట రూ.5.16 కోట్లు, రామకుప్పం–విజలాపురం రూ.3.85 కోట్లు, సీకేటీ రోడ్డు–పాకాల–దామలచెరువు రూ.2.20 కోట్లు, రాయలపేట–మాధవరం రూ.2.20 కోట్లు, రాయలపేట–కల్లుపల్లె రోడ్డుకు రూ.4.45 కోట్లు కేటాయించారు.

# ప్రజల పక్షాన పోరాడండి





మాజీ మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దామోదరరాజు, నాగభూషణరెడ్డి, నేతలు, ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రజాప్రతినిధులు


– మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

**చౌడేపల్లి:** ప్రతి కార్యకర్త జగనన్న సైనికుడిలా ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తిరుపతిలోని పెద్దిరెడ్డి స్వగృహంలో చౌడేపల్లె మండలంలోని 19 పంచాయతీలకు చెందిన నేతలు, కార్యకర్తలు వారిని కలిశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జరిగిన దాడులు, అన్యాయాలు, అక్రమణలు, కార్యకర్తలకు కలిగిన కష్టనష్టాల గురించి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డికి వివరించారు. ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాము న్నామని, అధైర్యపడొద్దని భరో సా ఇచ్చారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, అందరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీలోని బలోపేతం చేయడంతోపాటు గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, చేకూరిన లబ్ధిని వివరిస్తూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను తెలిపి, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి కార్యకర్త సైనికుల్లా కష్టపడి పనిచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాడి, పేద ప్రజలకు న్యాయం చేయడమే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, ఎస్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కళ్యాణ్ భరత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, పార్టీ స్టీరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పద్మనాభరెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే, ఎంపీకి సత్కారం**

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన జి.నాగభూషణరెడ్డి, పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను నిర్వర్తించడానికి అహర్నిశలు కష్టపడి పనిచేస్తానన్నారు. పార్టీ బలోపేతం చేయడంతోపాటు గ్రామస్థాయి నుంచి ప్రజల మద్దతుతో ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.

# నైరాశ్యం..నిర్వేదం



అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కీలకంగా మారాం.. పార్టీ అధికారంలోకి వచ్చింది.. మనకు మంచి భవిష్యత్తు ఉంటుంది.. మంచి నామినేటెడ్ పదవి వస్తుంది.. అని పలువురు పచ్చ నేతలు కలలుగన్నారు. అయితే వారి ఆశలపై బాబు నీళ్లు చల్లారు. దీంతో అనుకున్నదొకటి.. అయినదొకటి.. మనల్ని కరివేపాకులా వాడుకున్నారన్న నైరాశ్యం..నిర్వేదంలో ఉన్నారు.

- అనుకున్నదొక్కటి.. అయినదొకటి!
- నామినేటెడ్ పదవులు దక్కక తమ్ముళ్ల ఆందోళన
- ఆశపడి నిరాశకు లోనవుతున్న కూటమి నేతలు
- మున్ముందు రాజకీయ భవిష్యత్తే ఉండదనే డైలామా
- నగరి నుంచి కుప్పం వరకు 'పచ్చ' నేతల నైరాశ్యం

**చిత్తూరు అర్బన్:** నామినేటెడ్ పదవుల్లో తమను గుర్తించకపోవడంతో రాజకీయ భవిష్యత్తు ఉంటుందో.. లేదోననే నిర్వేదంలో ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కుప్పం మినహా అన్ని చోట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడటం, ఎంపీ స్థానం గెలుచుకోవడంలో కుప్పంలో పోలైన ఓట్లు ఓ సరికొత్త రికార్డును నెలకొలపడం తెలిసిందే. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని ఏడు స్థానాలకు గానూ ఆరు అసెంబ్లీ, ఓ పార్లమెంటు స్థానాన్ని గెలుచుకోవడంలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీలకు చెందిన నేతలు కూటమిగా ఏర్పడి కీలక పాత్ర పోషించారు. కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో నాలుగు దఫాలుగా నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తయ్యింది. ఇందులో చాలా మంది మహా మహా ఉద్దండులకు చోటు లభించకపోగా కీలక పదవులపై ఆశలు పెట్టుకున్న కూటమి నేతల ఆశలపై ఆ పార్టీ అధిష్టానం నీళ్లు చల్లి పక్కన పెట్టేసింది. అసలు తమకు రాజకీయ భవిష్యత్తు ఉందా..? రానున్న రోజుల్లో ఇవ్వడానికి ఏవైనా పోస్టులు ఉన్నాయా..? ఏ పోస్టు ఇవ్వకుంటే మున్ముందు జనం గుర్తు పెట్టుకుంటారా..? అనే ప్రశ్నలు ఆ పార్టీ ప్రధాన నేతలను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇదే సమయంలో తాము ప్రతిపాదించని, ఊహించని వ్యక్తులకు పలు కీలక పదవులు ఇవ్వడంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్లకు మింగుడుపడడంలేదు.

**పక్కన పెట్టేశారా..?**

- చిత్తూరులో ఎమ్మెల్యే జగన్‌మోహన్ గెలుపు చాలా మంది అంచనాలను తారుమారు చేసింది. ఈ గెలుపులో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు నాయుడు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ భర్త చంద్రప్రకాష్ నాయుడు, మాజీ కార్పొరేటర్ వసంతకుమార్ నాయుడు ఉన్నట్టు చెప్పుకుంటారు. సీకేకు ఎమ్మెల్సీ ఇస్తారనే ప్రచారం జరిగినా నిరాశే మిగిలింది. చుడా చైర్‌పర్సన్ కోసం వసంతకుమార్ ఏకంగా జగన్‌మోహన్‌తోపాటు ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు కూడగడితే ఆ సీటు మాజీ మేయర్ కటారి హేమలత తన్నుకుపోయింది. డీసీసీబీ చైర్మన్ తనకే దక్కుతుందనుకున్న దొరబాబుకు 'అమాస' రూపంలో భంగపాటు తప్పలేదు.
- అమర్‌నాథరెడ్డి గెలుపులో తానూ ఉన్నానని, ప్రభుత్వం వస్తే తనకు మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ ఇస్తారకున్న వి.కోట రామచంద్రనాయుడికి నైరాశ్యం తప్పలేదు. ఏఎంసీ చైర్‌పర్సన్ బీసీ–మహిళకు రిజర్వుకావడంతో ఆయన ఆశలు అడియాసలయ్యాయి. డీసీఎంఎస్ చైర్మన్ ఆశించిన పెద్దపంజాణి భాస్కర్‌రెడ్డిని అసలు పరిగణలోకే తీసుకోలేదు.
- పుంగనూరులో అనధికారిక ఎమ్మెల్యేగా కొనసాగుతూ, అన్ని అధికారాలను తన వద్దే ఉంచుకున్న చల్లాబాబు సైతం తప్పకుండా ఎమ్మెల్సీ ఇస్తారని ఊహించారు. కానీ వాటిని చంద్రబాబు ఊహలకే పరిమితం చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తనకే వస్తుందనుకున్న సమీపతికి పోటీగా సుబ్రమణ్యంరాజును తెరపైకి తీసుకొచ్చారు. బోయకొండ ఆలయ చైర్మన్ అవుతానని ఖారారుగా ఉన్న లక్ష్మీపతిరాజును వెంకటముని యాదవ్, ఎస్‌కె.రమణారెడ్డి రూపంలో కుర్చీకి అడ్డుగా నిల్చున్నారు.
- కుప్పంలో రెస్కో చైర్మన్ రేసులో రాజ్‌కుమార్, సురేష్‌బాబు, చంద్రశేఖర్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తమకే రెస్కో కుర్చీ ఇస్తారా..? కొత్త వాళ్లను కూర్చోపెడతారా..? అనే ప్రశ్నలు రోజురోజుకు వీళ్లల్లో హైటెన్షన్‌ను తెప్పిస్తోంది. ఏఎంసీ చైర్మన్‌గా పోటీ పడుతున్న కాణిపాకం వెంకటేష్, నాగరాజు, ఆంజనేయులరెడ్డి పరిస్థితి కూడా దాదాపు ఇలాగా ఉంది.
- కాణిపాకం చైర్మన్ కుర్చీ కోసం మణినాయుడు, పూర్ణచంద్రలో ఒకరికి భంగపాటు తప్పదు. శాప్ చైర్మన్, బంగారుపాళెం ఏఎంసీ చైర్మన్ ఆశించిన పూతలపట్టు ఎమ్మెల్యే మద్దతుదారుడు జయప్రకాష్ నాయుడికి ఏ పదవి రాకపోవడంతో ఇతని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నగరిలో దేశాలమ్మ గుడి చైర్మన్, ఏఎంసీ పదవులకు మదన్, సదాశివరెడ్డి, కృష్ణారెడ్డి మధ్య నెలకొన్న పోటీ కొత్త వ్యక్తుల తెరపైకి వచ్చేలా చెబుతున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఏఎంసీ చైర్మన్ పదవికి శ్రీధర్ యాదవ్, ధనుంజయ నాయుడు మధ్య నెలకొన్న పోటీలో ఒకరు కరివేపాకు అవడం ఖాయంగా కనిపిస్తోంది.

### 5న వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాక

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఈనెల 5వ తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ కృష్ణబాబు సందర్శించనున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. ఆయన కుప్పం నుంచి చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి చేరుకుని, పరిశీలించి, ఆస్పత్రి అధికారులతో సమీక్షించనున్నారని వారు పేర్కొన్నారు.

### శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు రేపు

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరు కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాల్‌లో ఈ నెల 4వ తేదీన శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘాల నాయకులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

# పేద రైతుపై టీడీపీ నేతల దాష్టీకం

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** పొలం పనులు చేసేందుకు వెళ్లిన పేద రైతు టి.చిన్నరెడ్డెప్ప ఆస్తిపై కన్నేసిన టీడీపీ నాయకులు ఆయన్ని చితకబాది, తీవ్రంగా గాయపరిచిన ఘటన శుక్రవారం పుంగనూరు మండలం కంగానెల్లూరు వద్ద చోటు చేసుకుంది. ఈ ఘటనపై బాధితుడి కుమార్తె టి.శ్యామల పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె కథనం మేరకు.. గ్రామానికి సమీపంలో టి.చిన్నరెడ్డెప్పకు సుమారు 88 సెంట్ల పొలం ఉంది. అందులో వ్యవసాయం చేసేందుకు వెళ్లిన టి.చిన్నరెడ్డెప్పపై అదే గ్రా మానికి చెందిన టీడీపీ నాయకులు టి.గంగులప్ప, టి.చెన్న కేశవులు, టి.జయశంకర్ దౌర్జన్యంగా దాడి చేసి గాయపరిచారు. పొలం పనులకు వెళ్లిన ప్రతిసారి గొడవ చేస్తున్నారని బాధితుడి కుమార్తె ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి పలుమార్లు తమపై దాడి చేసి తన తండ్రి చిన్నరెడ్డెప్ప, తల్లి శంకరమ్మను కొట్టి గాయపరిచిన్నారని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ స్థలం వివాదమై కోర్టులో కేసు సైతం వేసినట్లు చె ప్పింది. దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నరెడ్డెప్ప ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. ఫిర్యాదులో పేరొన్న కూటమి నేతల వారి కుటుంబ సభ్యుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఆమె కోరింది.



చికిత్స పొందుతున్న చిన్నరెడ్డెప్ప

## కొలమాసనపల్లిలో చోరీ



చోరీ జరిగిన ఇంటి కిటికీని పరిశీలిస్తున్న పోలీసులు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లిలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మంజులారెడ్డి ఇంట్లో చోరీ విషయం శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. కొలమాసనపల్లెకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మంజులారెడ్డి గురువారం కుటుంబసభ్యులతో కలిసి తన ఇంటికి తాళం వేసుకుని శాంతిపురంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ విషయం గమనించిన దొంగలు అదేరోజు రాత్రి ఆ ఇంటి కిటికీని తొలగించి, ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటికొచ్చిన బాధితురాలు చోరీ జరిగిన విషయం గుర్తించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా బీరువాలోని 20 గ్రాముల బంగారం, అర కిలో వెండి, రూ.80 వేల నగదును చోరీకి గురైనట్టు బాధితురాలు తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## శతాధిక వృద్ధుడి మృతి



సుబ్బానాయుడు(ఫైల్)

బంగారుపాళెం: మండల కేంద్రంలో శుక్రవారం శతాధిక వృద్ధుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్న సుబ్బానాయుడు(100) వయోభారం కారణంతో మృతి చెందాడు. ఈయన అక్టోబర్ 1924లో జన్మించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణానికి చెందిన శతాధిక వృద్ధుడు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## అవార్డు గ్రహీతకు సత్కారం



యుగంధర్‌ను దుశ్శాలువతో సత్కరిస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : వరల్డ్ బెస్ట్ అచీవర్ అవార్డు అందుకున్న రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నా యుగంధర్‌కు సత్కారం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయనకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. జనసేన నాయకులు మహేష్ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్టణంలో అంతర్జాతీయ సామాజిక అవార్డుల కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నా యుగంధర్ చేసిన సామాజిక సేవకు గాను వరల్డ్ బెస్ట్ అచీవర్ అవార్డు అందజేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాఘవ, సాయి, కిషోర్, మహేష్ బాబు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమంచి చెరువులో అక్రమంగా ప్రొక్లెయినర్లతో మట్టి తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్లు



# మాయగాళ్లకు మన్ను దన్ను


- పూడికతీత పేరుతో మట్టి అక్రమ రవాణా
- జిల్లా కేంద్రం నడిబొడ్డులోని కట్టమంచి చెరువులో తవ్వకాలు
- ఉదయం నుంచి రాత్రి వరకు మట్టి తరలింపు
- నిమ్మకు నీరెత్తిన చందంగా జిల్లా యంత్రాంగం

**చెరువు ప్రాణాధారం..పల్లెకు, పట్టణానికి ఆయువుపట్టు. జనం పాలిట కల్పతరువు.. ఎందరో మహానుభావుల దాతృత్వంతో వీటిని తవ్వించారు. అయితే కాలక్రమేణ స్వార్థం పెరిగింది. వాటిని ఆక్రమించుకునే ప్రబుద్ధులు పెరిగారు. ఫలితంగా నీటి వనరులు తగ్గిపోయి..తరచూ కరువు తాండవిస్తోంది. ప్రజలతో పాటు జంతువులు, పక్షులకూ నీరు కరువు అవుతోంది. ఆ ఆక్రమణలను తొలగించి ఆధునీకీకరించాలని నిర్ణయించారు. నిధులు మంజూరు చేశారు. అయితే నాయకులు కాసుల వేటలో పడి, ఆధునీకీకరణ లక్ష్యం నీరుగార్చారు. ఇష్టారాజ్యంగా తవ్వి రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అయినా జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తోంది.**

చిత్తూరు టాస్క్‌ఫోర్స్ : సీఎం సొంత జిల్లా కేంద్రంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ అక్రమ రవాణా గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. మట్టి అక్రమ రవాణా ఏదో మారుమూల సాగుతోంది అనుకుంటే పొరబాటే. జిల్లా కేంద్రంలోని నడిబొడ్డులో ఉన్న కొత్తబస్టాండ్ పక్కనే ఉన్న పేరొందిన కట్టమంచి చెరువులో ఈ అక్రమ మట్టి రవాణా తతంగం సాగుతోంది. నేలతల్లి కన్నీళ్లు పెట్టేలా ప్రతి రోజు యథేచ్ఛగా మట్టిని అక్రమార్కులు తరలించుకుపోతున్నారు.

**అధిక వేగంతో ట్రాక్టర్లు**

నగరంలోని కట్టమంచి చెరువులో తవ్వుతున్న మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు అధిక వేగంతో వెళుతున్నాయి. వందల చొప్పున ట్రాక్టర్లు పగటి పూట వేగంగా వెళుతుండడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. ట్రాక్టర్లలో మట్టి అక్రమ రవాణా కారణంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తుతున్నాయి. ఇంత తతంగం సాగిస్తున్నప్పటికీ చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.




కట్టమంచి చెరువు గూగుల్ మ్యాప్ చిత్రాలు

### పేరుకే సుందరీకరణ..

కట్టమంచి చెరువు సుందరీకరణ పనులను గత ఏడాది చేపట్టారు. కట్టమంచి చెరువు పూడికతీత పనులకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద పాల్గొని, గత ఏడాది సెప్టెంబర్ 24 వ తేదీన భూమి పూజ చేసి ప్రారంభించారు. చిత్తూరు కార్పస్ ఫండ్‌తో సుందరీకరణ పనులు చేపడుతున్నట్టు కూటమి ప్రజాప్రతినిధులు ప్రకటించారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో చేయాల్సిన అభివృద్ధి పనులు అనేకం ఉన్నప్పటికీ పూడికతీత పనులకే ప్రాధాన్యం ఇవ్వడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ పనుల ముసుగులో మట్టిని అక్రమంగా తరలించి కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారు.



కట్టమంచి చెరువులో అధిక లోతులో మట్టి తవ్విన ప్రదేశాలు

### రోజుకు వందల లోడ్లు

కట్టమంచి చెరువులో రోజు మూడు ప్రొక్లెయినర్లను పెట్టి మట్టిని తవ్విస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా 20 అడుగుల లోతు వరకు మట్టిని తవ్వుతున్నారు. ప్రతి రోజు వందల ట్రాక్టర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. 15 రోజులుగా రోజుకు వంద లోడ్లు చొప్పున ఉదయం నుంచి రాత్రి వరకు మట్టి అక్రమ రవాణా సాగిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న మట్టిని నగర సరిహద్దులో ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలకు తరలిస్తుండడంతో విమర్శలు గుప్పుమంటున్నాయి. సుందరీకరణ పనుల పేరుతో అక్రమంగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్న కూటమి ప్రజాప్రతినిధులపై ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పనులు జరగలేదని అంటున్నారు.



మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌లు

### ఎమ్మెల్యే దందాకు పరాకాష్ట



కట్టమంచి చెరువు సుందరీకరణకు కలెక్టర్ ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలు ఇచ్చారే తప్ప.. ఇక్కడ మట్టిని తవ్వుకుని ఇష్టారాజ్యంగా అమ్ముకోమని చెప్పలేదు. ఎమ్మెల్యే చేస్తున్న దందాలకు అక్రమంగా చెరువు మట్టిని తవ్వి వ్యాపారం చేస్తుండడమే నిదర్శనం. ఇప్పటి వరకు దాదాపు 5 వేల లోడ్లకు పైగా మట్టిని అమ్ముకున్నారు. అసలు చెరువులో మట్టి ఎంత తవ్వాలి? ఎంత తవ్వుతున్నారు? ఏం చేస్తున్నారు..? అన్న విషయం గురించి ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. అధికారుల తీరుపై అవసరమైతే ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం.

– ఎంసీ.విజయానందరెడ్డి,
చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త,
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

# వడగండ్ల వాన.. పంటలకు నష్టం

- చిత్తూరులో వడగండ్లవాన
- పెనుగాలులకు నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- రాలిన మామిడి కాయలు



ఈదురుగాలులకు కూలిపోయి మామిడి చెట్లు, రాలిన కాయలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం, మండలంలో శుక్రవారం సాయంత్రం అర్ధగంట పాటు పెనుగాలులతో కూడిన వడగండ్లవాన బీభత్సం సృష్టించింది. దీంతో మండలంలో పలుచోట్ల కరెంటు స్తంభాలు నేల కూలిపోయాయి. అకాలవర్షం మామిడి పంటను దెబ్బతీసింది. ఈదుగాలులకు మామిడి చెట్లలో 30 నుంచి 50 శాతం వరకు కాయలు నేలరాలిపోయాయని రైతులు వాపోతున్నారు. సిద్ధంపల్లి, పెరుమాళ్లకండ్రిగ, గువ్వకల్లు, దిగువమాసాపల్లి, తాళంబేడు, చింతలగుంట తదితర ప్రాంతాల్లో అధిక శాతం చెట్లు కూలిపోయాయని రైతులు చెబుతున్నారు.

**పెనుగాలులకు నేలవాలిన స్తంభాలు**

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో శుక్రవారం వీచిన పెనుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆకస్మాత్తుగా సాయంత్రం వాతావరణం చల్లబడింది. ఎక్కువగా గాలి వీయడంతో కొన్ని ప్రదేశాల్లో చెట్ల, కొమ్మలు లైన్‌పై పడి స్తంభాలు నేల కూలాయి. సిబ్బంది లైన్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే పలు ప్రాంతాల్లో లైన్ ట్రిప్ప్ అవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సత్యనారాయణపురం, బార్బర్‌కాలనీ, సాంబయ్యకండ్రిగ ప్రాంతాల్లో స్తంభాలు పడిపోయింది.

# బీసీ హాస్టల్ విద్యార్థులు శభాష్

- విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత
- అభినందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : బీసీ వసతి గృహ విద్యార్థులు శభాష్ అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ విద్యార్థులను అభినందించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఉన్నత చదువుల్లో మంచి మార్కులు సాధించాలని చెప్పారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకు నిరంతరంగా శ్రమించాలన్నారు. తప్పుదోవ పట్టించే సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రపంచంతో పోటీపడేలా మాతృభాష ప్రావీణ్యంతోపాటు ఆంగ్లభాషలో పట్టు పెంచుకోవాలని తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన పలమనేరు ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం విద్యార్థి యు.రాకేష్ యాదవ్ 553 మార్కులు, పుంగనూరు బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి జి. చరణ్ తేజ 552, వి.కోట బీసీ బాలికల వసతి గృహం విద్యార్థి ఎం. వర్ష 546, పుంగనూరు బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి సి.పి.దీపక్ 543, కత్తిరిపల్లి బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి ఈ.తరుణ్ 519, వి.ఆర్.కుప్పం బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి ఓ.జీష్ 518, పచ్చికాపలం బీసీ బాలరాజ్ వసతి గృహం విద్యార్థి జి దినేష్ 503, పాలసముద్రం బీసీ బాలికల వసతి గృహం విద్యార్థిని సి.తులసి 502, వి.కోట బీసీ బాలికల వసతి గృహం విద్యార్థిని పి.గాయత్రి 501 మార్కులు సాధించగా వారిని కలెక్టర్ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి మునీంద్రయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, వార్డెన్‌లు సోమసుందర్‌రెడ్డి, కుప్పుస్వామి, కోటేశ్వరరావు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

ప్లాట్లు కొనబడును.నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తిపాడు, బుజబుజనెల్లూరు, మైపాడురోడ్ ఏరియాలలో ప్లాట్లు కొనబడును. సంప్ర: 98464 48054, 79812 46865.

Wanted

ప్రముఖ కంపెనీలో టీం లీడర్‌గా తిరుపతి, చిత్తూరు జిల్లాలో పని చేయుటకు (స్త్రీ/పు) కావలెను. అర్హత: ఇంటర్ ఆపైన. సెల్: 9440351657

Gurappa Parameswara Electrical & Civil Works, Tirupati Walk - In - Hiring - Accountant Must have a Degree in Accounting (or) Finance at least 5 Years of Work Experience Should know how to use Accounting Software must Understand GST & Taxes. Cell: 9133309137, Email: gurappaparameswara@gmail.com

తిరుపతి ప్రముఖ Petrol Bunk నందు పనిచేయుటకు Pump Boys కావలెను. ఆకర్షణీయమైన జీతం: 14000 + Incentives ఇవ్వబడును. సెల్: 9030144410, 7799995945

మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 87459.

తిరుపతిలోని ప్రముఖ షాప్‌లో వర్క్ చేయడానికి కొత్తవారు/అనుభవజ్ఞులైన అమ్మాయిలు కావలెను. సంప్రదించండి సెల్: 9133857101, 9848230725

Virtusa కం అద్భుతమైన వ్యాపార అవకాశం లక్షల్లో కమీషన్, బోనాన్జ, అవార్డ్స్, రివార్డ్స్, ఫారిన్ ట్రిప్, లగ్జరి లైఫ్, Rtd. ఎంప్లాయిస్, చిట్స్, రియల్ ఎస్టేట్, పోస్టల్ ఏజెంట్స్. సంప్ర:: 9121350779.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,శ్రీరూం+భోజనం.Hyd.9182260297

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



చెంగల్‌రెడ్డి మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లె వద్ద శుక్రవారం రోడ్డు దాటుతున్న వృద్ధుడిని బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన చెంగల్‌రెడ్డి(79) నలగాంపల్లెలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని, స్వగ్రామానికి వెళ్లేందుకు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిని దాటుతుండగా తిరుపతి నుంచి బెంగళూరు వైపు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని 108లో ప్రథమ చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


## విద్యుత్‌షాక్‌తో యువకుడి దుర్మరణం



ప్రదీప్ మృతదేహం

బైరెడ్డిపల్లె: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కంచనపల్లెలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సెల్వం కుమారుడు ప్రదీప్ (20) ఇంట్లో ఫ్యాన్ పాడైపోవడంతో మరమ్మతులు చేస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడిని కుటుంబసభ్యులు బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రదీప్‌ను పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

## వివాహిత ఆత్మహత్య



శిల్ప మృతదేహం

కార్వేటినగరం: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పనలవానిమిట్ట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పనలవానిమిట్ట గ్రామానికి చెందిన జ్యోతి ప్రకాష్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. ఇతడు బెంగళూరుకు చెందిన శిల్ప(21)తో ప్రేమలో పడ్డాడు. ఈ క్రమంలో ప్రేమించిన యువతితో పెద్దల సమక్షంలో మూడేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది కుమారుడు ఉన్నాడు. త్వరలో తమ బిడ్డకు పుట్టింట్రుకలు తీసే కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నారు. భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో కానీ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, శిల్ప ఉరివేసుకుంది. గుర్తించిన స్థానికులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శిల్ప మృతి చెందిన సమాచారాన్ని బెంగళూరులో ఉన్న తల్లిదండ్రులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివాహిత మృతిపై పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు.

# ఆటోను ఢీకొన్న జేసీబీ

- తండ్రి కొడుకులకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భువనచంద్ర, రుషేంద్రబాబు

గుడిపాల: ఆటోను జేసీబీ ఢీ కొన్న ఘటనలో తండ్రి, కొడుకుతోపాటు మరో ఐదేళ్ల చిన్నారికి తీవ్రగాయాలైనట్టు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. నగరి మండలం శెట్టిగుంట గ్రామానికి చెందిన రుషేంద్రబాబు(35) తిరుపతిలో బియ్యం వ్యాపారం చేసేవాడు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి కందిపప్పు, ఉద్దిపప్పు తీసుకు వచ్చి తిరుపతిలో విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో గుడిపాల మండలం పల్లూరు గ్రామంలో నూతనంగా బియ్యం దుకాణం పెట్టేందుకు ఏర్పాట్లు చేశాడు. శుక్రవారం కాణిపాకం గుడికి వెళ్లి పల్లూరులో బియ్యం దుకాణం ప్రారంభోత్సవానికి కుటుంబ సమేతంగా తనకు ఉన్న ఎలక్ట్రిక్ ఆటో ఏపీ 39 డబ్ల్యుడీ 2074లో వస్తుండగా గుడిపాల మండలంలోని అనుపు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఏపీ26 ఏజే6976 జేసీబీ ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో రుషేంద్రబాబుతోపాటు అతని కుమారుడైన భువనచంద్ర(5) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సెలవుల ప్రకటనలోనూ కన్‌ఫ్యూజనే

తిరుపతి సిటీ: ఎస్వీయూ, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఈనెల 10 నుంచి జూన్ 15వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తొలుత ఈనెల 1వ తేదీ నుంచి సెలవులు ప్రకటిస్తూ అన్ని కళాశాలలకు ఉత్తర్వులు జారీచేశారు. ఆపై వర్సిటీ అధికారులు మళ్లీ ఆ ఉత్తర్వులను రద్దు చేసి 10వ తేదీ నుంచి సెలవులను ప్రకటిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి సెలవులు ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో వాయిదా పడిన పరీక్షలను మాత్రం ఈనెల 12, 14, 15 తేదీలలో జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు. సెలవుల ప్రకటనలోనూ అధికారులు విద్యార్థులను కన్‌ఫ్యూజన్‌కు గురిచేస్తున్నట్లు పలువురు విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

# విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన




వర్క్‌షాపులో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి సిటీ: స్వర్ణాంధ్ర –2047 సాధనలో భాగంగా సీఎం విజనరీకి అనుగుణంగా నియోజకవర్గాల అభివృద్ధి కోసం విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని డీఆర్వో నరసింహులు అధికారులను ఆదేశించారు. పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, టీం సభ్యులు, నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లే విధంగా పథకాలు రూపొందించాలని సూచించారు. వర్క్‌షాపులో ఏపీ ప్రణాళిక శాఖ సంచాలకులు రావి రాంబాబు, ప్రణాళికా శాఖ సీనియర్ సలహాదారు సీతాపతిరావు, సీపీఓ ప్రేమ్‌చంద్ర, తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

కుప్పం: పట్టణం చిత్తరంజని రోడ్డులోని ఓ ఇంట్లో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కుప్పం పట్టణం చిత్తరంజని రోడ్డులో బాలసుబ్రమణ్యం క్రాస్ వద్ద గుడుపల్లె మండలం కంచి బందార్లపల్లి గ్రామానికి చిరంజీవి పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పనికి వచ్చినా చిరంజీవి ఇంటి యాజమాని బాబుస్వామి బయటకు వెళ్లాలని పిలిచినా.. తాను రావడం లేదని ఇంట్లోనే ఉంటానని చెప్పి ఉండి పోయాడు. ఏమి జరిగిందో ఏమోకానీ చిరంజీవి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన యాజమాని తలుపు తట్టగా తెరవకపోవడంతో అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తీసి చూడగా ఇంట్లో చిరంజీవి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. ఈ మేరకు మృతుడి తల్లితండ్రులకు సమాచారం అందించారు. మృతుడి తల్లితండ్రులు, ఇంటి యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 57,863 మంది స్వామివారిని దర్శించుకోగా 31,030 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.